www.prajasakti.com
# ప్రజాశక్తి
మంగళవారం 1 ఏప్రిల్ 2025

## ముంబయి ఐఐటిలో వెలిగిన తెలుగుతేజం

ప్రజాశక్తి - రాయచోటి

ముంబయి గడ్డ తెలుగోడి అడ్డ అని మన తెలుగు తేజం మురికినాటి సాయి దివ్యతేజరెడ్డి నిరూపించాడు. బొంబాయి ఐఐటిలో మొదటి సంవత్సరం చదువుతున్న అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం చెన్నముక్కపల్లి గ్రామానికి చెందిన మురికినాటి శ్రీనివాసులు రెడ్డి కుమారుడు మురికినాటి సాయి దివ్య తేజ రెడ్డి యుజీ సోషల్ సెక్రటరీ ఎన్నికలలో ఘన విజయం సాధించి తెలుగు వారి సత్తా చాటాడు. ఐఐటి బొంబాయి చరిత్రలో మొదటిసారిగా ఒక తెలుగువాడు ఎన్నిక కావడం గర్వకారణం. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన సాయి దివ్య తేజ రెడ్డికి ప్రముఖుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.

సాయిదివ్యతేజరెడ్డి

# రాములోరి కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

- 5న బ్రహ్మోత్సవాలకు అంకురార్పరణ
- 11న ముఖ్యమంత్రి చంద్రబాబు రాక
- పనుల పరిశీలనలో వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

అత్యంత చారిత్రాత్మక ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయంలో ఏప్రిల్ 11న జరిగే శ్రీసీతారాముల కల్యాణానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కల్యాణ వేదిక ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం టిటిడి కల్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవన సమావేశ మందిరంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, వైఎస్ఆర్ జిల్లా ఎస్పి అశోక్ కుమార్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడులతో కలిసి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, టిటిడి అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టిటిడి అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి బ్రహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. 11వ తేదీన జరిగే సీతారాములవారి కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా, టిటిడి, పోలీసు అధికారులు సంయుక్తంగా, నిర్దిష్ట ప్రణాళికలతో విధులను నిర్వర్తించాలన్నారు. రాములవారి కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు కళ్యాణవేదిక ముందు ఏర్పాటు చేసిన ఒక్కో గ్యాలరీకి ఒకరిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామన్నారు. ఎక్కడా కూడా జనం తొక్కిసలాట జరుగకుండా అధికారులు, పోలీస్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రసాదం కౌంటర్ల వద్ద ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతిఒక్కరికీ తాగునీరు, అన్న ప్రసాదం కొరత లేకుండా అందేలా చూడాలన్నారు. కడప, రాజంపేట వైపు నుంచే ఆర్టీసీ బస్సులకు పార్కింగ్, ఇతర జిల్లాలనుంచి ఎన్ని బస్సులు వస్తున్నాయో తెలుసుకుని పక్కాగా ప్లాన్ రూపొందించుకుని పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక, కనీస వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. వైఎస్ఆర్ జిల్లా ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టి కృషి చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్యాలరీ వద్ద గట్టి భద్రతా చర్యలు చేపడతామన్నారు. టిటిడి జెఇఒ వీరబ్రహ్మం మాట్లాడుతూ టిటిడిలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టి కృషి చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్యాలరీ వద్ద శ్రీవారి సేవకులను నియమిస్తామన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్, జెఇఒ

**5న బ్రహ్మోత్సవాలకు అంకురార్పరణ**

ఈ నెల 5వ తేదీ బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమంతో ప్రారంభమవుతాయని, 6వ తేదీ శ్రీరామనవమి రోజున మొదటి రోజు ధ్వజారోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రారంభం, పోతన జయంతి, కవి సమ్మేళనం, సాయంత్రం శేష వాహన అలంకారం కార్యక్రమాలు జరుగుతాయి. 7న తేదీ వేణు గానాలంకారం, హంస వాహనం, 8న వటపత్ర శాయి అలంకారం, సింహ వాహనం, 9న నవనీత కృష్ణాలంకారం, హనుమత్సేవ. 10న మోహినీ అలంకారం, గరుడసేవ 11న శివదనుర్భంగాలంకారం, సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని, గరుడ వాహన సేవలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీసీతారాముల కల్యాణానికి ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. 12న రథారోహణం, రథోత్సవం, 13న కాళీయమర్ధనాలంకారం, అశ్వవాహనం. 14న చక్రస్నానం, మహాపూర్ణాహుతి, ధ్వజావారోహణం, 15న పుష్పయాగం నిర్వహిస్తారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, టిటిడి సిఇ సత్యనారాయణ, ఎస్ఇలు వేంకటేశ్వర్లు, మనోహర్, టిటిడి డిప్యూటీ ఇఒ నగేష్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, సిపిఒ వెంకటరావు, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఇ రమణ పాల్గొన్నారు.

# పాడి రైతుల సంక్షేమానికి కృషి

**- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి)

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పశువులకు నీటి సమస్య తలెత్తకుండా నీటితోట్ల నిర్మిస్తున్నామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంత్రి సంబేపల్లి మండలం, కొండావాండ్లపల్లెలో పశువుల నీటి తొట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఇందులో భాగంగా వేసవికాలంలో పశువులకు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రతి గ్రామానికి రెండు పశువుల నీటి తొట్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అన్నమయ్య జిల్లాకు 1, 115 పశువుల నీటితోట్లు మంజూరు చేశారాన్నరు. వీటిని 10 రోజుల లోపల పూర్తి చేసి పశువులకు నీటి సమస్య తరతకుండా చూడాలని డ్వామా పీడీకి సూచించారు. పశువుల నీటి తొట్లు ముఖ్యంగా పశువులు, గొర్రెలు, మేకలు, గుమికూడే ప్రాంతంలో గ్రామానికి మొదట్లో నిర్మించాలన్నారు. తొట్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రివర్యులు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డ్వామ పిడి వెంకటరత్నం, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి**

ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు తప్పకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకొని నీటి సంరక్షణ పనులు పకడ్బందీగా చేపట్టాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన సంబేపల్లి మండలం, కొండావాండ్లపల్లెలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన్నారు. వర్షం పడినప్పుడు వర్షపు నీరు వృథాగా పోకుండా ప్రతి నీటి బొట్టు భూములోకి ఇంకిపోయి భూగర్భ జలాలు పెరిగేందుకు తమ ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండావాండ్లపల్లెలో రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పిస్తాం**

**చిన్నమండెం:** మండల పరిధిలోని బెస్తపల్లి గ్రామంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అన్ని మౌలిక వసతులు కల్పించి గ్రామాలను ఆదర్శంగా దిద్దుతామని పేర్కొన్నారు. గతంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉన్నాయని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల కాలంలోనే గ్రామాలలో సిమెంట్ రోడ్లు, వీధిలైట్లు, డ్రెయినేజీ కాలవలు ఏర్పాటు చేసి ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు పట్టుదలతో కృషి చేస్తున్నామని, ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రాధాన్యత క్రమంలో గ్రామాలలో బోర్లు వేసి ప్రజలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. నీటి సమస్య తీరడం వలన గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నీటి తొట్లకు భూమిపూజ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

**ప్రజల నుంచి వినతుల స్వీకరణ**

సమస్యల రహిత సమాజం కోసం నిరంతర కృషి చేస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా జిల్లాలో ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను స్వీకరించారు. పరిష్కారం కోసం అధికారులకు పంపారు.

# వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

నిమ్మనపల్లె : వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్న ముస్లింలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్ట బిల్లును వ్యతిరేకిస్తూ నిమ్మనపల్లెలో ముస్లింలు నిరసనలు తెలిపారు. సోమవారం ముస్లింలకు పవిత్ర పండుగైన రంజాన్ పర్వదినాన ఉపవాస ప్రార్థనల అనంతరం నిమ్మనపల్లె జమియా మసీదు కు చెందిన ముస్లింలు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసనలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత సామరస్యాలను కాపాడవలసిన కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువస్తోందని పేర్కొన్నారు. ముస్లింల అణచివేతకు ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును సమాజంలో ఎండగడతామన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలన్నారు. ముస్లింల మనోభావాలకు, మసీదుల భూముల, ఆస్తుల పరిరక్షణకు వ్యతిరేకంగా, అణచివేత ధోరణితో తీసుకు వస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు ఏ ప్రభుత్వమైనా, ఏ రాజకీయ పార్టీ అయినా ఆమోదం తెలిపిన, మద్దతు తెలిపిన అటువంటి వాటికి భవిష్యత్తులో ఎన్నికల సమయంలో ముస్లిం మైనారిటీలు ఏకతాటిపై నిలుస్తూ తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వక్ఫ్ సవరణ బిల్లును కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మనపల్లి జామియా మసీదు ముస్లిం మైనారిటీ లు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేస్తూ మదనపల్లె కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్ చేతికి నల్లరిబ్బన్‌తో రంజాన్ ఈద్గ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ముస్లిం సోదరులు నల్లరిబ్బన్లు ధరించి రంజాన్ ప్రార్థనలకు హాజరయ్యారు. ప్రార్థనల అనంతరం రెడ్డి సాహబ్ మాట్లాడుతూ స్వయంప్రతిపత్తి ఉన్న వక్ఫ్ చట్టంలో సంబంధంలేని వారిని చొప్పించేలా సవరణ బిల్లు తేవాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దుర్మార్గమన్నారు. దేశవ్యాప్తంగా పార్టీలకతీతంగా ముస్లిం మైనార్టీలు ఉద్యమించి వక్ఫ్ సవరణ బిల్లును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

సామూహిక ప్రార్థనల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ముస్లిం సోదరులు

## మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

**- రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి**

ప్రజాశక్తి - రాయచోటి

ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని బండ్లపల్లె ఈద్గాలో ముస్లిం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్ధనలలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో మూడు పర్యాయాలు ముస్లిముల సంక్షేమానికి విశేష కృషి చేశారన్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా మైనార్టీలకు అండగా ఉంటూ ప్రభుత్వ పరంగా అందాల్సిన పథకాలన్నీ వారికి కేటాయిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని, ఇలాంటి ప్రభుత్వం పదికాలాలపాటు ఉండేందుకు అందరి ఆశీస్సులు ఉండాలని పేర్కొన్నారు. ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవర్చుకొని ఇతరులకు సహాయ పడాలన్నారు. పట్టణంలోని హిందూ, ముస్లిములు సోదర భావంతో కలిసిమెలిసి జీవించి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు .రంజాన్ ప్రార్థనలు అనంతరం మంత్రివర్యులు రాష్ట్ర ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాక్షలు తెలిపారు కార్యక్రమంలో రాయచోటి పట్టణంలోని ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- రామాపురం

రంజాన్ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డిని వైఎస్ఆర్ సిపి మైనార్టీ నాయకులు సోమవారం శాలువాతో సత్కరించి.. శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రామాపురం మండలం సుద్దమల్ల గ్రామం యర్రమరెడ్డి గారిపల్లెలో నీలకంఠరావుపేటకు చెందిన కార్యకర్తలు, నాయకులు మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మైనారిటీలకు మోహన్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మోహన్ రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు అయూబ్‌ఖాన్, జాఫర్‌వలి, కార్యకర్తలు పాల్గొన్నారు

చెక్కులను పంపిణీ చేస్తున్న వరలక్ష్మి, ఎమ్మెల్యే శ్రీధర్

## పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుల్లంపేట

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే అవర శ్రీధర్, ముక్కా వరలక్ష్మి అన్నారు. కడప జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ ముక్కారూపం నందరెడ్డికి వచ్చిన సిఎంఆర్ రిలీఫ్ ఫండ్స్ దరఖాస్తులను పరిశీలించి తొందరగా సిఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం చెక్కు రూపంలో తెప్పించి సోమవారం బాధితుల ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. మండలంలోని టి.కమ్మపల్లె పంచాయతీ కృష్ణంపల్లి గ్రామానికి చెందిన తోటగంగయ్యకు రూ.1,58,285, కొత్తపేట రాచపల్లి గ్రామానికి చెందిన గాలిచర్ల సుబ్బరాజుకు రూ.20,524, దలవాయిపల్లికి చెందిన ఉమామహేశ్వర్‌రెడ్డికి రూ.45 వేలు, పి.వి.జి.పల్లికి చెందిన తరిగోపుల పద్మావతికి రూ.1,18,251 ఇటీవల ఆసుపత్రిలో ఎక్కువ ఖర్చులు చేసి ఆర్థిక పరంగా ఇబ్బంది పడుతున్న సమయంలో వారికి చెక్కులను అందజేసి బాధితుల కుటుంబానికి అందజేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డులు, పక్కా గృహాలు, సిసి రోడ్ల నిర్మాణాలు కూడా ఎక్కువగా మంజూరు చేస్తామని తెలిపారు. మండలంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు గ్రామ గ్రామస్తులు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, పోలూరు కృష్ణమనాయుడు, కావుటూరి శ్రీరాములు నాయుడు, బత్తిన వేణుగోపాల్ రెడ్డి,పోలసాని కిరణ్, సింగమల రాహుల్‌రెడ్డి, సింగమల సాయిగిరీష్‌రెడ్డి, పోలుప్రేమకుమార్, యద్దలపల్లి పెంచలయ్య, మాదినేని బలరామయ్య కొండంపల్లి మల్లి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 3న బి.కొత్తకోట మండల సమావేశం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దిలీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు చెందిన రిపోర్టులతో హాజరుకావాలన్నారు.

# నిరసనను జయప్రదం చేయండి : ఫ్యాప్టో

మాట్లాడుతున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

పెండింగ్ బకాయిలు, నూతన వేతన సవరణ సంఘం, మధ్యంతర భృతి( ఐఆర్) సాధన కోసం ఈనెల 2న కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిర్వహించే నిసరనను విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ జాబిర్, గఫార్ ఖాన్ తెలిపారు.ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో జిల్లా నాయకత్వం మాట్లాడుతూ సరెండర్ లీవు బకాయిలు 2022 జనవరి నుంచి దరఖాస్తు చేసుకున్న వేలాది మంది ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారని, చనిపోయిన ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టలేదని పేర్కొన్నారు. లోకల్ బాడీస్‌లో ఖాళీలు లేవనే అసంబద్ధమైన కారణం చూపి నిలుపుదల చేశారని చెప్పారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన డిఎకు అనుసంధానంగా ఇవ్వాల్సిన 5 డిఎలకు సంబంధించి పెండింగ్ బకాయిలు ఉన్నాయని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇవ్వాల్సిన రెండు డిఎలను నేటికీ ప్రకటించ లేదని అన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ అమలు కోసం మన రాష్ట్రం నుంచి ఏ ప్రభుత్వం కూడా చిత్తశుద్ధి కనపరచడం లేదున్నారు. కనీసం 2004 సెప్టెంబరు 01న ముందు నియామకం అయిన వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకోవచ్చని కేంద్రప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను సైతం అమలు చేయని పరిస్థితి నెలకొందని అన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి సంవత్సరాల తరబడి ఉన్న సందిగ్ధతను తొలగించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఇన్ని ఇబ్బందులు మధ్య ఉపాధ్యాయులు స్వేచ్ఛగా, బోధించే పరిస్థితులు లేవనేది వాస్తవం అన్నారు. డిమాండ్లను ను తక్షణమే పరిష్కరించాలని 02న మధ్యాహ్నం 3 గంటల నుండి 4.30 గంటల వరకు జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు, అప్పటికీ పరిష్కారం కాని పక్షంలో రాష్ట్ర స్థాయి పోరాట కార్యక్రమం చేయాలని ఫ్యాప్టో కార్యవర్గం నిర్ణయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కో - చైర్మన్లు రవిశంకర్, శివారెడ్డి, ఎస్. రామకృష్ణ, డిప్యూటీ సెక్రటరీ జనరల్లు హరిబాబు, ఇలియాస్, జిల్లా ఫ్యాప్టో కోశాధికారి జఫరుద్దీన్ పాల్గొన్నారు.

# అరటి రైతులకు ఊతమివ్వని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

- అమాంతం పడిపోయిన అరటి ధరలు
- ఎండ తీవ్రతకు కింద పడుతున్న చెట్లు
- భారీగా పెరిగిన రవాణా వ్యయం
- ఆందోళనలో రైతన్నలు

అధిక ఉష్ణోగ్రతలకు విరిగిపోతున్న అరటి చెట్లు

ప్రజాశక్తి- సింహాద్రిపురం

జిల్లాలో సిరులు కురిపించిన అరటి కాయల ధరలు ప్రస్తుతం అమాంతంగా తగ్గి పోవడంతో రైతులు కుదేలువుతున్నారు. నియోజవర్గంలోని సింహాద్రిపురం, పులివెందుల, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లి మండలాలలో విస్తారంగా 8600 హెక్టార్లు అరటిసాగు చేశారు. ఈ ఏడాది అరటి దిగుబడి ఆశా జనకంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ధర లేకపోవడంతో రైతులు దిక్కులు చూస్తు న్నారు. జనవరి, ఫిబ్రవరి మాసం చివరినాటికి టన్ను అరటికాయలు రూ.25 వేలు ఉండడంతో చాలామంది రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అప్పట్లో విదే శాలలో అరటికాయలకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో ధరలు ఆశా జన కంగా ఉండేవి. ప్రస్తుతం విదేశాలలో డిమాండ్ తగ్గిపోవడంతో పాటు, స్థాని కంగా ఉన్న కంపెనీ ఏజెంట్లు సైతం అరటి కాయలు కొనుగోలుకు రాకపో వడం తో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో టన్ను అరటి కాయలు రూ. 5 వేలు నుంచి రూ.12 వేలు లోపల మాత్రమే కొనుగోలు చేస్తు న్నారు. అది కూడా మొదటి కోత అరటికాయలకు మాత్రమే. రెండో కోత అరటి కాయలను కొనుగోలుకు వ్యాపారులు సైతం రావడంలేదని రైతులు వాపోతున్నారు.

**ఉష్ణోగ్రతకు కింద పడుతున్న అరటి చెట్లు..**

ఇటీవల కాలంలో జిల్లాలో భారీగా ఉష్ణోగ్రత పెరగడంతో అరటి చెట్లు కింద పడిపోతున్నాయి ఎండ తీవ్రతకు తట్టుకోలేక మొక్క మధ్యభాగానికి విరిగి పోతున్నాయని రైతులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రత కారణంగా కాయలు సైతం నాణ్యత లోపించడంతో తక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందని వ్యాపారులు మరోవైపు చెబుతున్నారు.

**భారీగా పెరిగిన రవాణా వ్యయం..**

జిల్లాలో పండిన అరటికాయలు ఎక్కువ భాగం ఉత్తరాది రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి. గతంలో ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు 20 టన్నులు సామర్థ్యం కలిగిన లారీలు రూ .ఒక లక్ష 20వేలకు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఇదే సామర్థ్యానికి అక్కడికి చేరాలంటే రూ .2 లక్షల పైచిలుకు వరకు లారీ యాజమానులు డిమాండ్ చేస్తున్నారు. దీని కారణంగా అరటికాయలు ధర తక్కువ చేసి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపి రవాణా వ్యయం తగ్గేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న గోడౌన్

పులివెందులలో ఏర్పాటు చేసిన అరటి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

**నిరుపయోగంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్..**

గత ప్రభుత్వ హయాంలో పులివెందులలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసిన అది వినియోగంలోకి రాకపోవడంతో ఫలితం శూన్యంగా మిగిలింది. మార్కెటింగ్ శాఖ, పులి వెం దుల డెవలప్మెంట్ అథారిటీ (పాడ) ఆధ్వర్యంలో దాదాపు రూ .25 కోట్ల వ్యయంతో నిర్మించారు. అరటికాయలు, చెట్లు, ఆకుల నుంచి బై ప్రోడక్ట్‌ను అత్యాధునిక స్థాయిలో తయారు చేసే విధంగా యూనిట్ ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ గత ఏడాది అప్పటి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అట్ట హాసంగా ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం మారిపోవడంతో దాని ఊసే పాలకులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన ఈ యూనిట్ పై ప్రత్యేక దృష్టిసారించి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

**ప్రభుత్వమే ఆదుకోవాలి..**

ప్రస్తుతం మార్కెట్లో అరటికాయల ధరలు అమాంతంగా తగ్గి పోయాయి. పెట్టుబడి వ్యయం భారీగా పెరిగిపోవడంతో ప్రస్తుత ధరలు ఏమాత్రం గిట్టుబాటు కావు. కావున అరటి రైతులను ప్రభుత్వం తగిన ప్రోత్సాహాలు అందించి ఆదుకోవాలి.

**-సుబ్బారెడ్డి, అరటి రైతు, గురిజాల.**

**యూనిట్‌ను వినియోగంలోకి తేవాలి..**

గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఉన్నత ప్రమాణాలతో నిర్మించిన ప్రాసెసింగ్ యూనిట్‌ను వినియోగంలోకి తేవాలి. దీనివల్ల కొంతమేర రైతులకు లాభం పొందే అవకాశం ఉంది. **- వెంకటరమణారెడ్డి, అరటి రైతు, సింహాద్రిపురం.**

**ధరలు తగ్గిన విషయం వాస్తవమే..**

15 రోజుల నుంచి అరటికాయలు ధరలు తగ్గిన విషయం వాస్తవమే. డిమాండ్ కంటే దిగుబడి అధికం కావడంతో ధరలు తగ్గినట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరిస్తాం.

**- మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి, ముద్దనూరు.**

పురస్కారం అందుకుంటున్న అల్లం అశోక్‌కుమార్

## 'అల్లం'కు ఉగాది పురస్కారం

**ప్రజాశక్తి - నందలూరు**

అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన ఉగాది సంబరాలలో భాగంగా కవి సమ్మేళనంలో పాల్గొన్న నందలూరు మండలానికి చెందిన అల్లం అశోక్ కుమార్‌కు ఉగాది పురస్కారం అందజేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆహ్వానం మేరకు కవి సమ్మేళనంలో పాల్గొన్న అల్లం అశోక్ కుమార్‌ను కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు చేతుల మీదుగా పట్టు శాలువా, పూలమాల, జ్ఞాపికతో సన్మానించారు. ఈయన ప్రస్తుతం పెనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమం - స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాకారం పై వచన కవితను వినిపించి ప్రశంసలు అందుకున్నారు. పురస్కారం నందలూరు వాసికి దక్కడం ఎంతగానో సంతోషించదగ్గ, గర్వించదగ్గ విషయమని ఎస్‌టియు నందలూరు మండల శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు ఎస్.ఎం.డి షఫీవుల్లా, లీలా కృష్ణయ్య, జిల్లా నాయకులు మోహన్ రాజు, సంజీవ్ ప్రసాద్, రవిశంకర్ రెడ్డి, భరత్ కుమార్, నరసింహారావు, జె.వి.రమణ, మండల నాయకులు మహేశ్వర బాబు, మార్కండేయ రెడ్డి, వెంకటేష్, సురేష్ బాబు, శివ ఫణీంద్ర హర్షం వ్యక్తం చేశారు. పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిలాషులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

## హోటళ్లు పది గంటలకు మూసేయాలి : డిఎస్‌పి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

పట్టణంలో మంగళవారం నుంచి హోటళ్లు, షాపులు రాత్రి 10 గంటలకే మూసివేయాలని డిఎస్‌పి కొండయ్యనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులను దృష్టిలో పెట్టుకొని రాత్రి సమయాలలో కొద్దిగా మార్పులు చేస్తూ 10 గంటల నుండి 10.30 వరకు హోటళ్లు, షాపులు తెరుచుకోవచ్చని సమయాన్ని పొడిగించామన్నారు. రంజాన్ మాసం సోమవారం నాటితో ముగియడంతో, పొడిగించిన సమయాన్ని రద్దు చేస్తూ పోలీసు నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటలలోపే పట్టణంలోని హోటళ్లు, షాపులు, మూసివేయాలని పేర్కొన్నారు. పోలీస్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

## వైభవంగా శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు

**ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లి**

మండలంలోని బి.ఎర్రగుడిలో వెలిసిన శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపుగా బిందు సేవకు బోరు దగ్గరికి వచ్చారు. కలశాలు ధరించిన భక్తులు ఆలయానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. రాత్రి 10 గంటలకు శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారు జ్యోతిని, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రథమ జ్యోతిని వెలిగించారు. రెండవ జ్యోతిని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ, జాతీయ అధ్యక్షులు బండారు రఘురామయ్య వెలిగించారు. జోతులతో, నాద బృందాలు, అమ్మవారిని, భక్తిశ్రద్ధలతో తలపై ఉంచుకొని, అమ్మవారి భక్తి గీతాలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, విశేషంగా అలంరించింది. బాణసంచా పేలుస్తూ, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా, కనువిందుగా అమ్మవారు జ్యోతి స్వరూపిణిగా, ఆలయ వీధులలో ప్రజలకు భక్తులకు, దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం 6 గంటల వరకు అమ్మవారి గ్రామోత్సవం కనుల పండుగా సాగింది. జ్యోతి ఉత్సవాలను చూసేందుకు వివిధ మండలాల పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలిరావడంతో అన్ని విధులు కిటకిటలాడాయి. కార్యక్రమంలో శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అధ్యక్షులు కొరకూటి నరసయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గుద్దేటి రెడ్డెయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భోజనపు వెంకటరమణ, భోజనపు లక్ష్మీనారాయణ, కొరకూటి గోవిందు, కొరకూటి వీర నరసింహులు, భోజనపు రామయ్య, డక్కఓబులేసు, చిన్నగాలి మోహన్, దండే శ్రీనివాసులు భోజనపు రామకృష్ణ, టేకూరి వెంకటసుబ్బయ్య తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ గౌరవాధ్యక్షులు సంగీనాథం ఆంజనేయులు, అధ్యక్షులు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు, కోశాధికారి టేకూరి సుదర్శన్, గౌరవాధ్యక్షులు సుంకర రామచంద్రుడు, బి.ఎర్రగుడి ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 20న రాయలసీమ స్థాయి చర్చావేదిక

**ప్రజాశక్తి - చాపాడు**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత రాయలసీమ పరిస్థితిపై ఈనెల 20న మైదుకూరులో 'సీమ'స్థాయి చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన వనిపెంటలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రాయలసీమకు తాగు, సాగునీటి ప్రాజెక్టులు, నిరుద్యోగం, యువతకు ఉపాధి అవకాశాల పరిస్థితి, రాజకీయ పార్టీల తీరు అనే అంశంపై రైతు సేవా సమితి ఆధ్వర్యంలో చర్చావేదిక ఏర్పాటు చేశామని జిల్లాలోని రైతులు, రైతు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి కర్నూల్ రాజధానితో మొదలైనప్పటి నుంచి హైదరాబాద్ రాజధానితో కొనసాగి, ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ రాజధానితో తెలంగాణ విడిపోయి, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాయలసీమ ప్రాంతం కొనసాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన ముఖ్యమంత్రులంతా రాయలసీమ ప్రాంతం నుంచి ఎన్నికైనవారేనని తెలిపారు. వీరు రాయలసీమ అభివృద్ధి విషయంలో ఏ ఒక్కరు ప్రాముఖ్యత ఇవ్వలేదన్నారు. గతమంతా హైదరాబాదు అభివృద్ధికి, ప్రస్తుతం అమరావతి, పోలవరం, విశాఖపట్నం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాయలసీమ ప్రజలు, రైతులు, నిరుద్యోగులు రాజకీయాలకు అతీతంగా ఐక్యమై అవగాహన కల్పించుకొని భవిష్యత్ రాయలసీమ అన్న పేరుతో ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, రైతు నాయకులు ఆవుల నాగేష్, అక్కిదాసరి రమేష్, పోలయ్య, సుబ్బరాయుడు, బాషా, నాగరాజు పాల్గొన్నారు.

## లింగం సంజీవ్‌కు అంబేద్కర్ సేన రత్న అవార్డు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ్‌కు ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో డాక్టర్ బి.ఆర్,అంబేద్కర్ ఉగాది పుష్కరాలు మహోత్సవంలో మాలల రాష్ట్ర ఉద్యోగుల సంఘం, రిపబ్లిక్ ఇన్ పార్టీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో 'అంబేద్కర్ సేన రత్న' అవార్డు అందించినట్లు లింగం సంజీవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా మండల అధ్యక్షులు నుంచి జిల్లా యూత్ అధ్యక్షులుగా, జిల్లా అధ్యక్షులుగాను సేవలందించి ప్రస్తుతం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పోరాటాలు చేసినందుకు తనకు ఈ అవార్డు రావడం జరిగిందని వివరించారు. ఈ అవార్డు రావడం రావడానికి సహకరించిన తన గురువు దళితరత్న మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యామల సుదర్శన్, మాలల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్, రిపబ్లిక్ ఇన్ పార్టీ ఆఫ్ ఇండియా దాసరి చెన్నకేశవులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

అవార్డు అందుకుంటున్న లింగం సంజీవ్

# ఘనంగా రంజాన్ వేడుకలు

పీలేరు : ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

**ప్రజాశక్తి-రాయచోటి**

జిల్లాలో ముస్లిములు భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. 30 రోజులు పాటు ముస్లింలు పవిత్రంగా ఉపవాసం ఉండి ఆదివారంతో ఉపవాసాలు ముగిశాయి. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు చిన్న పిల్లలు నుంచి పెద్ద వారి వరకు ప్రత్యేక ప్రార్థన చేసి ప్రతి ఒక్కరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. **కలకడ:** ఈద్-ఉల్-ఫితర్ పండుగను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధ నిర్వహించుకున్నారు. మండల కేంద్రమైన కలకడ, దేవలంపేట, పాపిరెడ్డిగారిపల్లి, కోన, బంగారు వాండ్లపల్లి, నడిమిచర్ల, నవాబుపేట, ఎర్రకోటపల్లి తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు 30 రోజులుగా కఠిన ఉపవాసాలు ఉండి తమకు పవిత్రమైన ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు చిన్న పెద్ద తేడా లేకుండా ఈద్ ముబారక్ అంటూ ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు. **బి.కొత్తకోట :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని మండలంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణం, పిటిఎం రోడ్డులోని ఈద్గా వద్దకు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగం చేసుకుని శుభాకాంక్షలు తెలుపు కున్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, మాజీ ఉప సర్పంచ్ మాలిక్, ఎస్ఎస్ ఫయాజ్, జిల్లా ప్రచార కార్యదర్శి అయుబ్ భాష, డాక్టర్ అరిఫ్, హౌసింగ్ సొసైటీ మెంబర్ వల్లి, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, గుమ్మడికాయల చాంద్‌బాషా, సాదిక్, సద్దాం, ఖాదర్ బాషా,జాఫర్ బై, స్వాతి జిరాక్స్ సెంటర్ చాంద్ బాషా,పెద్ద మాలిక్,డాక్టర్ ఇలియాజ్, తబ్బు, జిలాన్, మటన్ రఫీ, షఫీ, ఇంతియాజ్, ముజీర్, ముజాహిద్, బాబా, మియా, షామీర్, అష్రఫ్ అలీ, పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని అన్ని మసీదుల నుంచి ముస్లీం సోదరులు సామూహికంగా ప్రత్యేక ప్రార్ధనలు జరుపుకున్నారు. మండలంలో ఎక్కడా ఎలాంటి అవాంక్షనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. **రామాపురం:** సామరస్యానికి, సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ అని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామం పాలన్నగారిపల్లెలో రంజాన్ సందర్భంగా వైసిపి మైనారిటీ నాయకుడు రసూల్ ఖాన్ ఇచ్చిన విందులో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. మైనారిటీలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ నాయకులు, కార్యకర్తలతో శ్రీకాంత్‌రెడ్డి పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ రామాంజులు మాజీ సర్పంచ్ మురళీధర్ రెడ్డి ఆదిరెడ్డి అమర్నాథ్‌రెడ్డి రామచంద్రారెడ్డి జిల్లా ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ కమిటీ మాజీ సభ్యుడు శివశంకర్, చిట్లూరు గ్రామం వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** ఈద్గా ప్రాంగణంలో పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా కూటమి నాయకులు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కె.కె. చౌదరి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు వంతగాని నరసింహ ప్రసాద్, టిడిపి నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులతో ప్రార్థనలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని, మైనార్టీలకు అండగా ఉంటామని, రాజంపేట టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులతో రాజంపేట నియోజకవర్గంలోని పలు ఈద్గాల వద్ద ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజంపేట టిడిపి మైనార్టీ నాయకులు, టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలో భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని జామియా మస్జిద్ ఈద్గా నందురంజాన్ పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లోని ఈద్గాలలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేసు కున్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలో ఘనంగా రంజాన్ వేడుకలు జరిగాయి. ముస్లిం సోదరులు బెంగళూరు రోడ్డులోని ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్, వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్ ఎస్ఎ.కరీముల్లా, మైనార్టీ సీనియర్ నాయకులు ఎస్ఐ మస్తాన్, ముస్లిం మైనార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆ లింగం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **కలికిరి:** రంజాన్ పర్వదిన వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో మసీదు దగ్గర నమాజ్ చేసి ఒకరు ఒకరు ఆపేయంగా ఆగింజనం చేసుకున్నారు. పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి ప్రజలందరికీ ఉగాది, రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. **పీలేరు:** ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) వండుగ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించారు. సోమవారం పట్టణంలోని అన్ని మసీదుల నుంచి ముస్లిం సోదరులు స్థానిక జెండామాను దగ్గరకు చేరుకుని, అక్కడి నుంచి సామూహికంగా అల్లాను స్తుతిస్తూ మదనపల్లి మార్గంలోని ఈద్గా మైదానం చేరుకుని, పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ప్రతి ఒక్కరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పీలేరు పట్టణ సిఐ యుగంధర్ పర్యవేక్షణలో ఎస్ఐ, సిబ్బంది ఈద్గా, పట్టణంలో ఎక్కడా ఎలాంటి అవాంక్షనీయ సంఘటనలకు అవకాశం లేకుండా గట్టి బందోబస్తుతోపాటు వాహనాల రాక పోకలను కూడా నియంత్రించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. మండలంలోని తలుపుల, జాండ్ల, బాలంవారిపల్లి, రేగళ్లు, వంటిల్లు మొదలగు గ్రామాల్లో ముస్లీంలు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బి.కొత్తకోట : ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

మదనపల్లి : ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే, ముస్లిం సోదరులు

గాలివీడు : ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

# ఆశాజనకంగా ఆరుతడి పంటలు

**ప్రజాశక్తి - చాపాడు**

రబీలో సాగు చేసిన జొన్న, మినుము, వేరుశనగ, నూగు పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు వరకు రైతులు పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట వివిధ దశలో ఉంది. మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం, విశ్వనాధపురం, బద్రిపల్లి, చియ్యపాడు, సీతారామపురం, అల్లాడుపల్లె, వెంగన్నగారి పల్లె, చెండ్లూరు, రేపల్లె గ్రామాల పరిధిలో 3వేల ఎకరాలలో రైతులు పంటలను సాగు చేశారు. మార్చి చివరికి ఎక్కువ భాగం నూర్పిడికి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. పెసర పంట నూర్పిడి ఇప్పటికే ప్రారంభించారు. కేసీ కెనాల్ పరిధిలో మాత్రం వరి పంట నూర్పిడి తర్వాత నూగు, దోస, మినుము, పెసర సాగును రైతులు చేపట్టారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట దిగుబడి ఆశాజనకం ఉంది. ప్రస్తుతం సాగు చేసిన ఆరుతడి పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. కేసీ కెనాల్ పరిధిలో మార్చి చివరి వరకూ నీరు విడుదల చేస్తారని ముందస్తు సమాచారం లేకపోవడంతో నూగు, పెసర పంటలు సాగు తగ్గింది. ప్రస్తుతం సత్తువలు, మందులు వేస్తున్నారు. దోస కాయల నూర్పిడి కొనసాగుతోంది.

సాగులో ఉన్న మినుము పంట

# భగ్గుమన్న భూ వివాదం

- దాయాదుల మధ్య ఘర్షణ
- కత్తులు, గొడ్డళ్లతో పరస్పరం దాడులు
- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు
- ఐదు బైకులు దగ్ధం

మృతిచెందిన నారాయణరెడ్డి

గాయపడిన జయరామిరెడ్డి

గాయపడిన సాంబశివారెడ్డి

గాయపడిన మల్లికార్జునరెడ్డి

దగ్ధమవుతున్న బైకులు

**ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం**

దాయాదుల మధ్య భూ వివాదం ఘర్షణకు దారి తీసింది. నొకరినొకరు కత్తులు, గొడ్డళ్లతో దాడులు చేసుకున్నారు. ఇరు వర్గాలకు చెందిన ఐదు బైకులును తగులబెట్టారు. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని ముదిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని సోమిరెడ్డిపల్లి పంచాయతీ, ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 159, 160 పొలం విషయమై సోమవారం దాయాదుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ముదిరెడ్డిపల్లి చెరువుకు సమీపంలో పొలం వద్ద ఇరు గ్రూపుల చెందిన వారు ఒకొనొకరు వాదోపవాదాలకు దిగి చివరకు ఘర్షణ పడ్డారు. వెంట తెచ్చుకున్న కత్తులు, గొడ్డళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో చెందిన పెసల నారాయణరెడ్డి (65) అనే వ్యక్తి మృతి చెందారు. ఒక గ్రూపునకు చెందిన పెసల జయరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి మరో గ్రూపునకు శివారెడ్డి, ఆదిలక్ష్మి రక్తపు మడుగులో తీవ్రంగా గాయపడ్డారు. ఇరు గ్రూపులకు చెందిన ఐదు బైకులను దగ్ధం చేసుకున్నారు. గాయపడిన వారు పొలంలో స్పృహ లేకుండా పడిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కొందరిని 108 వాహనంలో, మరికొందరని తమ వాహనంలో చికిత్స నిమితంత ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. ఇదీలా ఉండగా వీరి భూ వివాదం కోర్టులో నడుస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - కడప :** కడప నగరంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని కడప జిల్లా డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. నగరంలోని మురుగు వాడలు, మారుమూలలనున్న శివారు ప్రాంతాలకు సరఫరా చేస్తున్న నీటి నమూనాలను ప్రయోగశాల ద్వారా పరీక్షించాలి అన్నారు. రాయలసీమ జిల్లాలోని అన్ని ప్రధాన నగరపాలక సంస్థల్లో స్థానిక అవసరాలకు సరిపడా నీటిని నిలువ చేసుకోవడానికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఉన్నాయి. కడప నగరపాలక సంస్థలో మాత్రం నీటిని నిలువ చేసుకునే జలాశయాలు లేవు అని అన్నారు. పెన్నా నదిలో మోటార్లు బిగించి బండి కనుమ వాటర్ గండి వద్ద క్లోరిన్ కలిపి నేరుగా వివిధ దశల్లో నగరంలోని పలు ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని పంపిణీ చేస్తున్నారు అన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి ఇళ్లకు నీటిని చేర్చే డిస్ట్రిబ్యూటరీ పైప్ లైన్లు నాగరాజుపేట, మోచంపేట, బెల్లంమండి, అగాడి తదితర ప్రాంతాల్లో మురుగు కాలువల్లో ఉన్నాయని తెలిపారు. తాగునీరు సరఫరా విధానంలో ఇబ్బందులు గమనించిన నగర ప్రజలు 90 శాతం మంది తాగటానికి డబ్బా నీటిని కొనుగోలు చేస్తున్నారు అన్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ శుద్ధ మంచినీటి ప్రయోగశాల చేస్తున్న పరీక్షలతోపాటు నీటిలో మలిన కణాల అంచనా, నీటిలో ఉన్న ఖనిజాలు లవణాలు, హానికరమైన బ్యాక్టీరియాలను గుర్తించడం వంటి పరీక్షలు చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని పేర్కొన్నారు.

## గ్రామాల్లో మౌలిక వసతులు శూన్యం : సిపిఎం

**ప్రజాశక్తి- అట్లూరు :** పేదలు నివాసం ఉండే గ్రామాల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందిందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. సోమవారం అట్లూరు, ముత్తుకూరు, దేవసాగర్, మద్దూరు, వరికుంట్ల, కోనరాజుపల్లి, తంబలగుంది, బాల్‌రెడ్డిబాయి ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుల చాంద్ బాషా, మండల పార్టీ కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ మండలంలో అనేక గ్రామాలలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. అనేక గ్రామాల్లో శ్మశాన వాటికలకు ప్రహరీలు వేవని ప్రజలకు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. చాలా గ్రామాలలో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మురుగు కాల్వలు లేక నీరు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలను అనారోగ్యానికి గురిచేస్తోందన్నారు. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అనేక సమస్యలు ప్రజా చైతన్య యాత్ర బృందం దృష్టికి, తీసుకొచ్చారని చెప్పారు. స్మార్ట్ మీటర్లను విద్యుత్ అధికారులు బిగిస్తారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రవిచంద్ర, స్టీఫెన్, భాస్కర్, యేసు, స్వప్న, మార్తమ్మ, కుమారి, లలితమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

కార్మికుల నగదు అందజేస్తున్న దాత, సర్పంచ్

## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : సర్పంచ్

**ప్రజాశక్తి - నందలూరు**

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కళా బంధు చిక్కాల బాలాజీ రావు కొనియాడారు. బాలాజీ రావు సతీమణి దివంగత చిక్కాల జయలక్ష్మి స్మారకార్థం నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు 17 మందికి ఉగాది పండుగను పురస్కరించుకుని నూతన వస్త్రాలు కొనుగోలు నిమిత్తం ఒక్కొక్కరికి రూ.వెయ్యి నగదును ముఖ్య అతిథి సర్పంచ్ సూర్యనారాయణ, దాత చిక్కాల బాలాజీ రావుల చేతుల మీదుగా స్థానిక లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ దాతృత్వం కొందరికే వుంటుందని, అటువంటి వారిలో బాలాజీ రావు ఒకరని, పారిశుధ్య కార్మికుల సేవలు గుర్తించి వారికి వస్త్ర దానం చేయడం ఆనందదాయకం అని ఆయన్ను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కన్వీనర్ అల్లం అశోక్ కుమార్ మాట్లాడుతూ బాలాజీ రావు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కార్మికుల దినోత్సవం మేడే నాడు పంచాయతీ లోని పారిశుధ్య కార్మికులందరికీ నూతన వస్త్రాలు అందజేస్తామని, పదవ తరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు కూడా నగదు పారితోషికం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆకుల చలపతి, బాలసుబ్రహ్మణ్యం స్వామి, విశ్రాంత రైల్వే ఉద్యోగి చామంచి పెంచలయ్య పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై దాడి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై సొంత బంధువులే దాడి చేసి గాయపర్చారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అనపగుట్టలో నివాసముంటున్న వినోద్ కుమార్‌రెడ్డి(31) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. ఉగాది పండుగ సందర్భంగా స్వగ్రామం మదనపల్లెకు వచ్చాడు. అమ్మమ్మను పలకరించేందుకు స్థానిక ఎస్‌బిఐ కాలనీలో ఉండే మేనమామ మేకల వెంకటరమణారెడ్డి ఇంటికి వెళ్లాడు. అమ్మమ్మను ఎందుకు సక్రమంగా చూసుకోవడం లేదని మేనమామను అతని కుమారుడు సురేందర్‌రెడ్డిలను నిలదీశాడు. ఆమెను బాగా చూసుకోవాలని మరోసారి ఇలా జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించి వెళ్లిపోయాడు. అనంతరం బెంగుళూరుకు బయల్దేరేందుకు రాత్రి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లాడు. కాపుకాచిన మామ, బావమర్దులు వినోద్ కుమార్‌రెడ్డిని అడ్డగించి గొడవ చేసి రాళ్లదాడి చేశారు. అక్కడే ఉన్న టూ టౌన్ పోలీసులు దాడిని అడ్డుకుని గాయపడిన బాధితున్ని స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## స్కూటర్‌ను ఢీకొన్న ట్రాక్టర్ : ఒకరు మృతి

**ప్రజాశక్తి-ములకలచెరువు (మదనపల్లె అర్బన్)**

ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు దుర్మరణం చెందిన విషాదకర సంఘటన సోమవారం ములకలచెరువు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, అమ్మ చెరువుమిట్టకు చెందిన కంపొళ్ల శంకర్(43) టెంపో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో తన అత్తగారి ఊరు ములకలచెరువులో జరుగుతున్న జాతరకు బైక్‌లో బయల్దేరాడు. మార్గ మధ్యం లోని బురకాయలకోట వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన శంకర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శాంత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న ములకలచెరువు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన శంకర్ (ఫైల్ ఫొటో